క్లుప్తంగా

వ్యాధి నిరోధక టీకా కేంద్రాల పరిశీలన



పరిశీలిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ అధికారులు

మంచిర్యాలటౌన్: పట్టణంలోని రాజీవ్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న టీకా కేంద్రాలను బుధవారం మంచిర్యాల డివిజన్ ఆరోగ్య అధికారులు సందర్శించి పరిశీలించారు. సీహెచ్‌వో రామ్మూర్తి, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్ అకోశ్‌రోడ్డు, ఇక్బాల్ అహ్మద్‌నగర్, రాజీవ్‌నగర్‌లోని టీకా కేంద్రాల్లో సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇన్ ప్యాక్ కండీషనింగ్, వీవీఎం, ఎక్స్‌పైరీ తేదీ, ఓపెన్ వాయిల్ పాలసీ, టీకా అనంతరం అనర్థాల నివారణ కిట్, హబ్ కట్టర్ ప్రాముఖ్యతను వివరించారు. అన్ని రకాల టీకాలను నిర్ణీత సమయానుసారం పిల్లలకు ఇప్పించి, వివిధ రకాల వ్యాధుల నుంచి పిల్లలను కాపాడాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యవంతమైన భవిష్యత్ సమాజ నిర్మాణం కోసం పిల్లలకు వ్యాధినిరోధక టీకాలను ఇప్పించాలని, టీకాలను ఇచ్చిన వెంటనే యూవిన్ యాప్‌లో పొందు పరచాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యశోద, ఏఎన్‌ఎంలు విజయ, స్వప్న, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, సుజాత పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

దండేపల్లి: ఎస్సీ రిజర్వేషన్‌కు తక్షణమే చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ నెల 11న హైదరాబాద్‌లో మాదిగ ఉపకులాల విశ్వరూప మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు బుధవారం మహాసభ పోస్టర్‌ను ఎమ్మార్పీఎస్ నాయకులు ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి తగరపు సత్యం, నాయకులు మాదిగ శ్రీనివాస్, నరేష్, వినయ్, సతీష్, గణేష్, అంజి తదితరులు పాల్గొన్నారు.

'కుటుంబ సంక్షేమ నిధి'లో సభ్యులుగా చేరాలి



సభ్యత్వం తీసుకున్న ఉపాధ్యాయులు

నెన్నెల: టీఎస్‌యూటీఎఫ్ ప్రారంభించిన కుటుంబ సంక్షేమ నిధి పథకంలో టీచర్లు అందరూ సభ్యులుగా చేరాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల రాజవేణు అన్నారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మండలంలో పర్యటించి సభ్యత్వ నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దురదృష్టవశాత్తు టీచర్లు మృతిచెందితే వారి కుటుంబాలను ఆదుకునేందుకు ఈ సంక్షేమ పథకాన్ని జులై 1న ప్రారంభించామన్నారు. ఇప్పటికి 7వేల మంది సభ్యులుగా చేరారని చెప్పారు. ప్రతి సభ్యుడి నుంచి సేకరించే రూ.100ను జమ చేసి బాధిత కుటుంబానికి 15రోజుల్లో అందజేస్తామన్నారు. పాఠశాలల్లోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చక్రపాణి, జిల్లా కార్యదర్శులు కిరణ్‌కుమార్, ఎండి అయూబ్‌ఖాన్ పాల్గొన్నారు.



'భగీరథ' పైపులైన్ లీకేజీ

రామకృష్ణాపూర్: పట్టణంలోని ఏ జోన్ రామాలయం ఏరియాలో మిషన్ భగీరథ పైపులైన్ బుధవారం లీకేజీ అయింది. కోల్ బెల్ట్ రహదారికి ఆనుకునే ప్రధాన పైపులైన్ లీక్ కావడంతో పెద్ద ఎత్తున నీరు వృథాగా పోయి కొద్దిసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. స్థానికులు అధికారులకు సమాచారం ఇవ్వడంతో నీటి సరఫరాను నిలిపివేసి మరమ్మతు చేపట్టారు.

ఆసుపత్రి.. అసంపూర్తి..!

- నత్తనడకన నూతన ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ నిర్మాణ పనులు
- ప్రస్తుతం నిర్వహిస్తున్న భవనంలో వసతులు కరువు
- వార్డులు, గదులు సరిపోక, మరుగుదొడ్లు లేక రోగుల ఇబ్బందులు



ప్రభుత్వ వైద్య కళాశాల ఆవరణలో ఆసుపత్రి నిర్మాణం కోసం తవ్వకాలు



ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఎదుట వాహనాల పార్కింగ్‌తో ఇక్కట్లు

మంచిర్యాలటౌన్: మంచిర్యాలకు ప్రభుత్వ మెడికల్ కాలేజీని మంజూరు చేసి మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ తరగతులు సైతం పూర్తి చేస్తుండగా, ఇటీవలే సెకండ్ బ్యాచ్‌లో ఎంబీబీఎస్ విద్యార్థులు చేరగా వారికి తరగతులను నిర్వహిస్తున్నారు. కానీ మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఉండాల్సిన ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి పక్కా భవనం లేదు. ఏరియా ఆసుపత్రిగా ఉన్న మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రినే ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిగా పేరు మాత్రమే మార్పిడి చేశారు. వైద్య కళాశాలకు అనుబంధంగా 300 పడకల ఆసుపత్రి తప్పనిసరిగా ఉండడంతో పాటు, అన్ని రకాల వైద్య సేవలను అందించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఐబీ చౌరస్తాలో నిర్వహిస్తున్న ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి భవనంలోని వార్డులు, గదులు సరిపోక పోగా, సరైన మరుగుదొడ్లు లేవు. ఓపీ సమయాల్లో వందలాది మంది రోగులు వైద్య పరీక్షల కోసం వస్తే, వారికి ఇరుకుగా ఉన్న వరండాలోనే గంటల తరబడి ఒకరిపై ఒకరు పడుతున్నట్లుగా వేచి ఉండాల్సిన పరిస్థితి. ఆసుపత్రికి అన్ని రకాల మౌలిక వసతులతో కూడిన పక్కా భవనం ఉండాలని భావించిన ప్రభుత్వం ఈ ఏడాది జూన్ 9న రూ.510 కోట్లతో ప్రభుత్వ మెడికల్ కాలేజీ భవనం, 300 పడకల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నిర్మాణ పనులను ప్రారంభించారు. దాదాపుగా 5నెలలు కావస్తున్నా, ఇప్పటికీ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పనులు పునాదుల వద్దనే ఉన్నాయి. కొత్త భవనాన్ని పూర్తిచేస్తేనే రోగులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలను అందించడంతో పాటు, ఎంబీబీఎస్ అభ్యసిస్తున్న విద్యార్థులకు పూర్తి స్థాయిలో వైద్య విద్యను అందించేందుకు అవకాశం ఉంటుంది.



ఓపీ సమయంలో రోగుల రద్దీ

మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని 200 పడకలతో ఉన్న జిల్లా ఆసుపత్రిలోనే నిర్వహిస్తున్నారు. మహారాష్ట్ర, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల మూడు జిల్లాల ప్రజలకు ఈ ఆసుపత్రినే. అన్ని రకాల వైద్యం కోసం ఇక్కడికి రోజుకు 600 లకు పైగా ప్రజలు వస్తుంటారు. వీరికి వారికి ఉన్న అనారోగ్య సమస్య ప్రకారం ఓపీ రాస్తే, ఇరుకుగా వరండాలోనే ఓపీ కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. ఎక్స్‌రే, రక్త, మూత్ర పరీక్షల కోసం సరైన గదులు లేక, వైద్య సిబ్బంది,

సమస్యలతో సతమతం

రోగులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. టాయిలెట్స్ సక్రమంగా లేకపోవడం, వాటికి మరమ్మతు చేయకపోవడంతో, ఆసుపత్రి బయట ఉన్న పబ్లిక్ టాయిలెట్స్‌ను రోగులు, వారి సహాయకులు వినియోగిస్తున్నారు. ఆసుపత్రిలో వార్డులు తక్కువగా ఉండడం, రోగులు పెరిగితే వారిని వరండాల్లోనే ఉంచి వైద్యం అందించాల్సిన దుస్థితి నెలకొంది. పాతభవనం కావడంతో, వర్షాకాలంలో స్లాబ్ పెచ్చులు ఊడిపోయి, వార్డులో పడిపోతున్నాయి. భారీ వర్షం కురిస్తే, వర్షపు నీరు బయటకు వెళ్లలేని పరిస్థితిలో ఆసుపత్రిలోని వార్డుల్లోకి చేరుతుంది. సరైన పార్కింగ్ లేకపోవడంతో, అడ్డదిడ్డంగా వాహనాలను ఆసుపత్రి ఎదుట పార్కింగ్ చేయడం వల్ల 108 అంబులెన్సులు ఆసుపత్రిలోకి రాలేని పరిస్థితి నెలకొంటుంది. ఏటా వానాకాలంలో దాదాపు నాలుగు నెలల పాటు వరదకు గురవుతున్న మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికే తరలిస్తుండడంతో, బాలింతలు, గర్భిణులను వరండాల్లోనే బెడ్‌లను వేసి ఉంచాల్సిన పరిస్థితి. నూతన ఆసుపత్రి భవనం ఇప్పటికే పనులను



ఇటీవల పిల్లల వార్డులో ఊడిపడిన స్లాబ్ పెచ్చులు

ప్రారంభించి ఉంటే దాదాపుగా పిల్లర్లు పూర్తయ్యి, స్లాబ్ వరకు పూర్తయ్యేంది. ఇప్పుడిప్పుడే పనులను ప్రారంభించగా, భవనం పూర్తయ్యేందుకు మరో రెండేళ్ల సమయం పట్టే అవకాశం ఉంది. అప్పటి వరకు రోగులతో పాటు, ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థులకు ఇబ్బందికరమే.

బీసీ జాగృతి పట్టణ యువజన సంఘం అధ్యక్షుడి ఎన్నిక



కళ్యాణ్‌కు నియామకపత్రం ఇస్తున్న శ్రీనివాస్

పాతమంచిర్యాల: తెలంగాణ బీసీ జాగృతి యువజన సంఘం పట్టణ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన పుట్ట కళ్యాణ్‌ను నియమిస్తున్నట్లు తెలంగాణ జాగృతి పట్టణ అధ్యక్షుడు వైద్య భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. నియామక పత్రాన్ని తెలంగాణ బీసీ జాగృతి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నరెడ్ల శ్రీనివాస్ అందించారు. బీసీ జాగృతి సంస్థాగత నిర్వహణలో పాలుపంచుకుని బీసీల సమస్యల పరిష్కరించడానికి కృషి చేయాలని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ జాగృతి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పొట్టాల మల్లేష్, ఉపాధ్యక్షుడు హిమ్మత్ సింగ్, హమాలీసంఘం అధ్యక్షులు లక్ష్మణ్, శేర్ల కనకరాజు, బైరీ శ్రీనివాస్, కొండపాక విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పుస్తెమెట్టెలు అందజేత



పుస్తెమెట్టెలు అందజేస్తున్న సేవాసమితి అధ్యక్షుడు

లక్సెట్టిపేట: మండలంలోని వెంకట్రావ్‌పేట గ్రామానికి చెందిన ఎంబడి సునీత వివాహానికి లక్సెట్టిపేట శివసాయిగణేష్ సేవాసమితీ ఆధ్వర్యంలో బుధవారం పుస్తెమెట్టెలు అందజేశారు. సునీతది నిరుపేద కుటుంబం కావడంతో పాటు, తండ్రి చనిపోయాడు. దీంతో ఆమె వివాహానికి వీటిని అందించినట్లు సేవాసమితి అధ్యక్షుడు పాటిబండ్ల శ్రీరామమూర్తి తెలిపారు. సమితీ సభ్యులు ప్రసన్న, సుమ తమ్మ, ప్రభాకర్, ప్రసాద్ ,విజయలక్ష్మి, ధనలక్ష్మి, శ్రీనివాస్, లావణ్య, వైష్ణవి, లక్ష్మి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మరోసారి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలి

- బెల్లంపల్లి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం చిన్నయ్య



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి: తాండూర్ మండలానికి చెందిన సీపీఐ, కాంగ్రెస్ పక్షాల నాయకులు, కార్యకర్తలు అధికార బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. బెల్లంపల్లిలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయా పార్టీలకు చెందిన వంద మంది గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన వారిలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మామిడాల రాజేశం , తాండూర్ మండల సీపీఐ కార్యదర్శి సాలిగామ సంతోష్, రేచినీ గ్రామ కార్యదర్శి ముక్క వెంకటేశం , మాదారం త్రీ ఇంక్‌లైన్ గ్రామ కార్యదర్శి వాసాల నాగరాజు, తెలంగాణ మహిళ సమాఖ్య మండల అధ్యక్షురాలు దాసరి లక్ష్మి, తాండూర్ మండల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గోపి, ఇతరముఖ్య నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. వీరికి బెల్లంపల్లి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం చిన్నయ్య గులాబీ కండువా కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు. రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్శితులై బీఆర్‌ఎస్‌లో చేరినట్లు ఎమ్మెల్యే చిన్నయ్య అన్నారు. మరోసారి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో తాండూర్ ఎంపీపీ ప్రణయ్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మహేందర్ రావు, దత్తుమూర్తి, బీఆర్‌ఎస్ నాయకులు సంతోష్‌గట్టు తదితరులు పాల్గొన్నారు.

అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేస్తా



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జాన్సన్‌నాయక్



ఖానాపూర్: పార్టీలోకి ఆహ్వానిస్తున్న జాన్సన్‌నాయక్

- బీఆర్‌ఎస్ ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్

జన్నారం: ప్రజలు ఆశీర్వదించి ఈ సారి ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిపించి అవకాశమివ్వాలని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా అని ఖానాపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్ అన్నారు. మండలంలోని కలమడుగులో బుధవారం బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ సరోజన, జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, పెంబి జెడ్పీటీసీ జానుబాయి, పార్టీ మండల అధ్యక్షుడు రాజరాంరెడ్డి, కలమడుగు గ్రామ సర్పంచ్ కార్తిక్ రావు, ఎంపీటీసీ స్వరూపరాణి, మార్కెట్ కమిటీ జిల్లా డైరెక్టర్ భరత్‌కుమార్, గ్రామ పార్టీ నాయకులు స్వదేశ్‌కుమార్, జాడి శంకర్, సంతోష్, గోపాల్, సత్తన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఖానాపూర్: పేదప్రజల అభివృద్ధి కోసం మరోసారి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని ఆ పార్టీ ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్ అన్నారు. పట్టణంలోని శాంతినగర్‌కాలనీలో బీజేపీ నాయకుడు, వార్డు మాజీ సభ్యుడు సిరిగారపు లింగన్న ఆధ్వర్యంలో పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జాన్సన్ నాయక్ హాజరై వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాజేందర్, నారాయణరావు, ఖలీల్, శ్రీనివాస్, సంతోష్, జానుబాయి, సురేశ్, శంకర్, వెంకటప్పయ్య ఉన్నారు.

గ్రామాల్లో ముమ్మర ప్రచారం

ఖానాపూర్: పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. మండలంలోని బీర్నంది గ్రామంలో బీఆర్‌ఎస్ కార్యాలయాన్ని ఆ పార్టీ నాయకులు ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో మోహిద్, రాజగంగన్న, లక్ష్మణ్‌రావు, శ్రీధర్, భూమేశ్ ఉన్నారు.

అంగవైకల్యాన్ని లెక్కచేయని అభిమానం



ర్యాలీలో నడుచుకుంటూ వస్తున్న దేవేందర్ రెడ్డి

బెల్లంపల్లి: అభిమానం అంటే అది. మరుగుజ్జుతో జన్మించి సరిగ్గా నడవలేని, ఓ చేయిలేని దివ్యాంగుడు రెండున్నర కిలో మీటర్ల దూరం వరకు ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొని, సభకు హాజరై పార్టీ, ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఉన్న అభిమానాన్ని చాటుకున్నాడు. బెల్లంపల్లిలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో బుధవారం అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సింగరేణి తిలక్‌స్టేడియంలో ప్రజా ఆశీర్వాద సభ జరిగింది. ఈ సభకు నెన్నెల మండలం కోనంపేట గ్రామానికి చెందిన దివ్యాంగుడైన దేవేందర్ రెడ్డి హాజరయ్యేందుకు బెల్లంపల్లికి వచ్చాడు. పాత సింగరేణి జీఎం కార్యాలయం చేరువలో గ్రామం నుంచి వచ్చిన బస్సును పార్కింగ్ చేయడంతో అక్కడి నుంచి బయల్దేరిన ర్యాలీలో సకలాంగులతో సమ ఉజ్జీగా సభాస్థలి వరకు నడిచి ప్రత్యేకతను చాటుకున్నాడు. సభకు హాజరై సీఎం కేసీఆర్‌ను చూసేందుకు అంగవైకల్యాన్ని లెక్క చేయకుండా దేవేందర్ రెడ్డి రావడాన్ని చూసిన చూపరులు, బీఆర్‌ఎస్ శ్రేణులు ఎంతగానో ముచ్చట పడ్డారు.

వానరాల వీరంగం.. శునకాల బీభత్సం

- కోతులు, కుక్కల బెడదతో జంకుతున్న జనం
- నియంత్రణలో నిర్లక్ష్యం వహిస్తున్న బల్దియా అధికారులు
- పట్టణ వాసులకు తప్పని తిప్పలు



గీతామందిర్ ఆలయ గోడపై కోతుల గుంపు



గంగాకాలనీలో నడిరోడ్డుపై కుక్కల గుంపు

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఎటుచూసినా కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. మరోవైపు వానరాల బెడదతో ప్రజలు బయటకు రావాలంటేనే బిక్కుబిక్కుమంటున్నారు. శునకాలు, వానరాలు వీరంగం సృష్టిస్తూ జనంపై దాడి చేస్తున్నా నియంత్రించాల్సిన అధికారులు ఆ దిశగా దృష్టిసారించటం లేదు. దీంతో ప్రధాన రహదారులు, కాలనీలు, ఏ వీధిలో చూసినా కుక్కలు, కోతులు గుంపుగుంపులుగా దర్శనమిస్తున్నాయి. సరదాగా ఆడుకుందామని బయటకు వస్తున్న చిన్నారులపై దాడులు చేస్తుండటంతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. అటు ప్రజాప్రతినిధులకు, అధికారులకూ ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ కనీసం పట్టించుకోవటం లేదని ప్రజలు వాపోతున్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణాపూర్ పట్టణంలో వీధి కుక్కలతో పాటు వానరాల బెడద రోజురోజుకు తీవ్రమవుతోంది. ప్రధాన రహదారులతో పాటు ఏ వాడలో చూసినా కుక్కలు, కోతుల గుంపులే దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఆందోళనలకు గురవుతున్నారు. కొన్ని నెలలుగా పట్టణంలో ఈ దుస్థితి నెలకొన్నప్పటికీ ఏ ఒక్కరూ పట్టించుకున్న పాపానపోవటం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వానరాలు ఏకంగా ఇళ్లల్లోకి వస్తూ ప్రతాపాన్ని చూపిస్తుండటంతో బెంబేలెత్తిపోతున్నారు. ఇంటి పైకప్పులు, రేకులపై దూకుతూ రేకులను పాడుచేస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి విధులకు వెళ్లే కార్మికులు శునకాల కారణంగా తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు.

పరిష్కారమేది...?

కుక్కలు, కోతుల సంచారంతో క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఆందోళనకర పరిస్థితులు నెలకొని ఉండగా, అధికారులు ఏ మాత్రం పట్టింపు లేకుండా ఉంటున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని నెలల క్రితం కుక్కలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టినప్పటికీ, మళ్లీ వాటి బెడద తీవ్రమైన నేపథ్యంలో అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. మరోవైపు అడవుల్లో ఉండాల్సిన కోతులు ఇళ్ల మధ్య సంచరిస్తుండగా అటు ప్రజాప్రతినిధులు గానీ, అధికారులు గానీ, ఎందుకు చర్యలు చేపట్టడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. బోన్లలో బంధించి తిరిగి అటవీ ప్రాంతాలకు సురక్షితంగా తరలించటానికి వస్తున్న ఇబ్బందులేమిటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి కుక్కలు, కోతులను నియంత్రించే చర్యలు చేపట్టాలని, వీటిని పట్టుకునేందుకు బోనులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కోతులను నియంత్రించాలి



కోతుల కారణంగా ఇంట్లో నుంచి బయటకు రావాలంటే భయమవుతోంది. పిల్లలను స్కూల్ పంపించే సమయంలో గుంపులు గుంపులుగా వస్తున్నాయి. ఒక్కోసారి మీదపడుతున్నాయి. ఈ సమస్యను అధికారులు చాలా సీరియస్‌గా తీసుకొని కోతులను వెంటనే నియంత్రించే చర్యలు చేపట్టాలి.

- హంసవేని, గృహిణి

అధికారులు పట్టించుకోవాలి



పట్టణంలో కుక్కలు, కోతుల బెడద తీవ్రంగా ఉంది. అసలు ఊళ్లో ఉన్నామా లేక అడవిలో ఉన్నామా అర్థం కావటం లేదు. రోడ్ల మీద, వీధుల్లో కుక్కలు, కోతుల కారణంగా చిన్నపిల్లల నుంచి మొదలు అందరం బిక్కుబిక్కుమంటున్నం. లీడర్లు, అధికారులు పట్టించుకోకపోవటం బాధాకరం.

- గుర్రాల మొగిలి, రిటైర్డ్ కార్మికుడు

ప్రతిపాదనలు పంపిస్తాం..

కుక్కలు, కోతుల సమస్య ఇక్కడ తీవ్రంగానే ఉంది. యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్(ఏబీసీ సెంటర్) గతంలో జిల్లాలో ఒకటి ఉండేది. ఇటీవల కుక్కల బెడద తీవ్రమైనందునా ప్రతీ మున్సిపాలిటీలో ఒక ఏబీసీ కేంద్రం ఏర్పాటు చేయాలని సూచించారు. ఇక్కడ ఏబీసీ సెంటర్ ఏర్పాటు చేసి కుక్కలను నివారిస్తాం. క్యాతనపల్లిలో ప్రభుత్వ స్థల కేటాయింపు కోసం కలెక్టర్‌కు త్వరలో ప్రతిపాదనలు పంపిస్తాం.

- వెంకటనారాయణ, మున్సిపల్ కమిషనర్

జాగల కోసం జనం పరుగులు



బస్సు ఎక్కి చెన్నూర్‌కు వెళ్తున్న మహిళలు

వేమనపల్లి: చెన్నూర్‌లో ఇళ్ల స్థలాలు ఇస్తాండ్లట రండీ పోదమంటూ ఊరు, వాడ జనం జాతరల పరుగులు తీస్తున్నారు. వాస్తవమేంటో తెలియని అమాయకులు ఒకరిని చూసి మరొకరు తండోప తండాలుగా వెళ్లి ఇళ్ల స్థలాలు ఆపుకుంటున్నారు. చెన్నూర్ నియోజకవర్గ కేంద్రం సమీపంలోని బావురావుపేట శివారులో సుమారు 14 గుంటల ప్రభుత్వ భూమి, దాని పక్కనే పట్టా భూములు ఉన్నాయి. సదరు భూమిలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామని వామపక్ష, ఇతర పార్టీ నాయకులు అమాయక ప్రజలకు ఆశ పెడుతున్నారు. ఎన్నికల సమయం కావడంతో జనసమీకరణ కోసం రాజకీయ నాయకులు ప్రజలకు మాయమాటలు చెప్పి ప్రలోబాలకు గురి చేస్తున్నారు. దీంతో మండలంతో పాటు అన్ని గ్రామాలలో, రోజూ వందలాది మంది తరలివెళ్తున్నారు. తిండి తిప్పలు మాని బావురావుపేట శివారులో గుడిసెలు వేసి కొందరు అక్కడే ఉంటున్నారు. ఇది నా జాగా, అది నీ జాగా అంటూ వారే హద్దులు కూడా నిర్ణయించుకుంటున్నారు. ఎన్నికల సమయం కావడంతో అడ్డుకుంటే ఎక్కడ తమకు నష్టం జరుగుతుందోనని అధికార, ప్రతిపక్ష పార్టీలు మిన్నకుండిపోతున్నారు.

బీర్‌ఎస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా

భీమారం: మండలంలోని దాంపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు గంగిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, చేగొండ శ్రీనివాస్ పార్టీ సభ్యత్వానికి, పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు బుధవారం విలేకరులకు తెలిపారు. పార్టీలో ఎంతో క్రమశిక్షణతో పనిచేస్తున్నప్పటికీ గుర్తింపులేదని వాపోయారు. త్వరలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.